నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 03 మార్చి 2023

మహిళ సంఘం సభ్యులు రుణాలను సక్రమంగా చెల్లించాలి

ఏపీఎం శిరీష

నవతెలంగాణ-పిట్లం

మహిళా సంఘాల సభ్యులు అన్ని రకాల రుణాలను సక్రమంగా చెల్లించాలని ఏపీఎం శిరీష అన్నారు. గురువారం మండలంలోని తిమ్మానగర్ క్లస్టర్ మార్‌దండా గ్రామసంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘం సభ్యులు అన్ని రకాల అప్పులను సక్రమంగా చెల్లించి ప్రతి సంఘ రసీదులు భద్రంగా దాచుకోవాలని, అనేక రకాల అప్పు వసూళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. శ్రీనిధి, బ్యాంక్‌లోన్ బకాయిలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం సోలార్ యూనిట్, చేపల పెంపకం, పీఎంఎఫ్‌ఎం ఈ పథకాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు రాజు, శాంత, శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రంజిత్‌గౌడ్, వీఓఏ రవీందర్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామిని దర్శించుకున్న మొబైల్ కోర్టు జడ్జి

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని కామారెడ్డి మొబైల్ కోర్టు జడ్జి వెంకటేష్ ధ్రువ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ, స్థానిక ఎస్ఐ అనిల్, మాచారెడ్డి ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో హై టెన్షన్ వైర్లు..

- చేతికి అందే ఎత్తులోనే
- వంగిపోయిన స్తంభాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ


నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లో హెచ్‌టీ(హైటెన్షన్) వైర్లు ప్రమాదకరంగా మారాయి. నివాస ప్రాంతాల మీదుగా అరచేతికి అందే ఎత్తులో భయానకంగా వేలాడుతున్నాయి. దశాబ్దకాలంగా నగర విస్తీర్ణం కలిగినప్పటికీ దానికనుగుణంగా హెచ్‌టీ వైర్లు మార్చడంలో విద్యుత్ శాఖ వెనుకబడింది. ఫలితంగా ఈ ప్రాంతాల్లోని ప్రజలు భయం భయంగా బతుకుతున్నారు. దీనికి తోడు హెచ్‌టీ వైర్లున్న స్తంభాలు వంగి ఏ క్షణంలో కిందపడతాయోనని భయం నెలకొంది. తాజాగా సీతారాంనగర్ కాలనీలో ఓ విద్యుత్ స్థంభం ప్రమాదకరంగా వంగిపోయింది.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం వివిధ కేటగిరిలో 1,78,142 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ఉపకేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 3311 కేవీ ఉప కేంద్రాలు 215 ఉన్నాయి. నిజామాబాద్ నగరం ప్రత్యేక వేగంగా విస్తరిస్తోంది. దశాబ్ద కాలంలో నగరం



అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు



ఓ ఇంటి వద్ద చేతికి అందే ఎత్తులోనే హై టెన్షన్ వైర్లు

గుర్తుపట్టనంతగా మారిపోయింది. వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారి ఆపై ఇండ్ల నిర్మాణాలతో కాలనీలుగా మారాయి. సాయినగర్ 1,2, గంగాస్థాన్, రేడియో స్టేషన్, వినాయక్ నగర్, ఆర్యనగర్, మాధవ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీ ఇలా ఇవన్నీ కూడా నగర విస్తరణలో భాగంగా కొత్త కొత్త కాలనీలు వందల సంఖ్యలో వెలిశాయి. కానీ విద్యుత్ శాఖ అందుకు అనుగుణమైన మార్పులు చేయలేకపోయింది. గతంలో వ్యవసాయ భూముల్లో ఉన్న హెచ్‌టీ వైర్లను అదేవిధంగా ఇప్పటికీ కొనసాగిస్తుంది. ఫలితంగా నివాసప్రాంతాల పైనుంచి ప్రస్తుతం హెచ్‌టీ వైర్లు ప్రమాదకర స్థాయిలో వేలాడుతున్నాయి. ముఖ్యంగా సీతారాం నగర్ కాలనీ, కోటగల్లి, విజ్ఞాన్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో అరచేతికి అందేలా ప్రమాదకరమైన హెచ్‌టీ వైర్లు నేటికీ కొనసాగుతున్నాయి. దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అంశంపై కొన్ని కాలనీలోని బాధితులు ఎస్సీతో పాటు పలువురికి విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదు. సాధారణంగా హెచ్‌టీ వైర్లు ప్రధానమైన రోడ్లకు ఆనుకొని వేయాల్సి ఉండగా చిన్న చిన్న గల్లీలోనూ ఈ వైర్లు ప్రస్తుతం ఉన్నాయి.



వంగిపోయిన విద్యుత్ స్థంభం

వైర్లను తొలగించండి

నివాస ప్రాంతాలపై ప్రమాదకరంగా హెచ్‌టీ వైర్లు వేలాడుతున్నాయి. ఈ అంశంపై పలుమార్లు జిల్లా అధికారులను కలిసినా మా మొర ఆలకించడం లేదు.

– దత్తు, సీతారాంనగర్ కాలనీ

వంగిపోతున్న స్తంభాలు..

హెచ్‌టీ వైర్లు ఏర్పాటు చేసి దశాబ్దకాలమవుతున్నప్పటికీ ఆ స్థంభాలను మార్చడంలో తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. దీంతో కరెంటు స్తంభాలు తుప్పు పట్టి వంగిపోతున్నాయి. నాలుగో విడత పట్టణ ప్రగతిలో వంగి ఉన్న స్తంభాలు 108 గుర్తించినప్పటికీ అందులో 88 సరి చేశారు. కానీ నేటికీ వంగి ఉన్న స్తంభాలు ఉండడం గమానార్హం. హెచ్‌టీ వైర్ల తొలగింపునకు సంబంధించి ఏఈ, డీఈలకు విన్నవించినా ఇది తమ పరిధిలో అంశం కాదని దాటవేస్తున్నారు. అయితే ఈ అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేశామని పైనుంచి ఆమోదం లభించడం లేదని ఇక్కడి జిల్లా అధికారులు చెప్తున్నారు.

గుడిసెలు తొలగింపు

నెహ్రునగర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించిన తహసీల్దార్

- అడ్డుకున్న నాయకులు.. ఎమ్మెల్యే షకీల్‌కు వినతి

నవతెలంగాణ-బోధన్

ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను తహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లి.. 'ఇది జానకంపేట్ చెరువు శిఖం భూమి' అంటూ పేదలు వేసుకున్న గుడిసెలను గురువారం తొలగించారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పేదలతో కలిసి వచ్చి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ నివాసంలో ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాటలకు తలోగ్గి పేదల గుడిసెలను తొలగించడం సమంజసం కాదని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు వచ్చి అధికారులను అడ్డుకున్నారు. నేతల విన్నపంతో ఎమ్మెల్యే షకీల్ ఎమ్మార్వోతో మాట్లాడి గుడిసెలను తొలగించవద్దని ఆదేశించినట్టు నాయకులు తెలిపారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్ల నిర్మాణానికి 3 లక్షల రూపాయలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు. గత 50 సంవత్సరాల నుంచి నిరుపేదలైన గ్రామీణ శ్రామికులు నెహ్రూనగర్‌లో ఇల్లు లేకుండా జీవిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఇది సమంజసం కాదన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక ఐక్యతతో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుడిసెలు వేయడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా అన్యాక్రాంతం అవుతుంటే కొంతమంది అక్రమ కబ్జాలకు పాల్పడి అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటుంటే వారిని వదిలేసి నిరుపేదలైన పేద ప్రజల గుడిసెలని ఎమ్మార్వో తొలగించడం విడ్డూరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రియల్ ఎస్టేట్ వలన జరిగిందని ఆరోపించారు. తమ పోరాటానికి గ్రామ ఎంపీటీసీ ఇమ్రాన్ ఖాన్ మద్దతు తెలిపారని వివరించారు. పూర్తిగా భూమి ప్రజలకు దక్కేంతవరకూ పోరాటం కొనసాగుతుందని, ఎవరైనా ఆటంకపరిస్తే పోరాటాన్ని తీవ్రం చేస్తామనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, స్థానిక ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, ఫారూఖ్, గంగామణి, షమీం, జహీరాబి ప్రజలు పాల్గొన్నారు.



నిరుపేదలతో నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- బిచ్కుంద వ్యవసాయ సంచాలకులు
- రైతులకు అవగాహన



మాట్లాడుతున్న సంచాలకులు

నవతెలంగాణ-బిచ్కుంద

చిరుధాన్యాలతో ఆరోగ్యం చేకూరుతుందని బిచ్కుంద వ్యవసాయ సంచాలకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరాన్ని మిల్లెట్ సంవత్సరంగా నిర్ణయించడంతో చిరుధాన్యాల సాగు, వాటి ఉపయోగంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. మండలంలోని సీతారంపల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బిచ్కుంద వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ.. సారవంతమైన భూమి కోసం పంట మార్పిడి తప్పనిసరి అని, పంట మార్పిడిలో భాగంగా ఒకే రకమైన పంటలు సాగుచేయకుండా రాగులు జొన్నలు, ఊదలు, కొర్రలు, సామేలు, పరిగెలు పంటలు సాగు చేయడం ద్వారా భూమి సారవంతంగా తయారై రైతులకు ఆదాయంతో పాటు చిరుధాన్యాలతో వంటకాలు తయారు చేసుకుని తినడం వల్ల ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడుతుందని, వివిధ రకాల జబ్బుల నుంచి ఆరోగ్యం కాపాడుకోవచ్చునని అన్నారు. వరి సాగు తగ్గించాలని, యూరియా వాడకం తగ్గించి యూరియా బదులు నానో యూరియా పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోచయ్య, సర్పంచ్‌లు గంగారెడ్డి, రాములు, రైతుబంధు సమితి కోఆర్డినేటర్లు విట్టల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సాయిరాం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంగారెడ్డి, రిలయన్స్ కోఆర్డినేటర్ ముకుంద్, రైతులు ఉన్నారు.

కృష్ణాజివాడిలో పంటల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో యాసంగి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు యాసంగిలో సర్వే నెంబర్ ప్రకారం చేసిన పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే యాసంగి పంటలలో ఆశిస్తున్న చీడపీడలు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, ఇంచార్జి వ్యవసాయ విస్తరణ అధికారి రవి, రైతులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఏఎస్ఐ రాములు పోలీస్ సిబ్బందితో కలిసి మండల ప్రజలకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందన్నారు. మహిళలు, పిల్లలే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతూ వివిధ రకాల వేధింపులకు గురిచేస్తున్నారని వివరించారు. ఆన్‌లైన్లో ఎన్నో రకాల యాప్‌ల ద్వారా వివిధ షాపింగ్‌లు, ఉద్యోగాలు, లావాదేవీలు తదితర అవసరాల నిమిత్తం విరివిగా ఆన్‌లైన్ సేవలను వినయోగించడం పెరిగిందన్నారు. దీన్ని ఆసరా చేసుకొని సైబర్ నేరస్తులు లోన్లు ఇస్తామని, తక్కువ ధరకు వస్తువులు, వాహనాలు ఇస్తామని చెప్పి డేటా సేకరించి బ్యాంకుల్లో ఉన్న నగదును కాజేసి తిరిగి వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేరాల బారిన పడకుండా పోలీస్‌శాఖ సైబర్ కాంగ్రెస్, ఉమెన్ సేఫ్టీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యా వ్యవస్థల్లో ఆన్‌లైన్ భద్రత కల్పించడంతో పాటు సైబర్ నేరాలను నియంత్రించేందుకు అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సైబర్ నేరాలు నియంత్రించడంలో ఉపాధ్యాయులు తమవంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం

- నినదించిన అంగన్వాడీ ఉద్యోగులు
- రెండవ రోజు సమ్మె విజయవంతం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యేవరకూ ఎంతవరకైనా పోరాడుతామని అంగన్వాడీ ఉద్యోగులు నినదించారు. ఈ మేరకు అంగన్వాడీ ఉద్యోగుల మూడు రోజుల సమ్మెలో భాగంగా గురువారం నిజామాబాద్ పాత కలెక్టర్ కార్యాలయం వద్ద నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్, భీంగల్ ప్రాజెక్టులకు చెందిన అంగన్వాడీ టీచర్లు ఆయాలు పెద్దఎత్తున కదిలివచ్చి ఉదయం 10 గంటలకే బైఠాయించారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. తమ సమస్యలతో కూడిన ఫ్లకార్డులను చేతబూని తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ సమస్యల పరిష్కారం పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని, అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోవటం లేదని, అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని అంగన్వాడీ ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం బడ్జెట్లో నిధులకు కోత పెడుతున్నారని ఏ రకమైనటువంటి సంక్షేమ పథకాలు అమలు జరపకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని వారన్నారు. అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యూటీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు వాటిని పట్టించుకోవటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లను టీచర్లుగా పేరు మార్చి వేతనాలు మాత్రం అరకొరగా ఇస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు కనీసం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ పశ్చిమబెంగాల్ ,రాజస్థాన్ తదిత రాష్ట్రాల్లో మనకన్నా ఎక్కువ వేతనాలు ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ హెల్త్ కార్డులను పెన్షన్స్ సౌకర్యాన్ని, పండగ బోనస్‌లను ఇస్తున్నారని ధనిక రాష్ట్రం అయినా తెలంగాణలో మాత్రం కేంద్రం గతంలో పెంచిన వేతనాలు కూడా అమలు జరపటం లేదని అందువల్ల వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాలను చెల్లించడంతోపాటు ఎనిమిది సంవత్సరాల నుంచి ఇవ్వవలసిన టీఏ, డీఏలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ లోపు కనీసం నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించని యెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ధర్నా అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యలు పరిష్కరించటం కొరకు ప్రభుత్వానికి వెంటనే తెలియజేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి అంగన్వాడీ ఉద్యోగులు చేదోడు వాదోడుగా ఉంటున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు పి.స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, శివరాజమ్మ, రాజ సులోచన, జ్యోతి, వాణి, సందీప, లక్ష్మి, గోదావరి, పద్మ, సీఐటీయూ నాయకులు నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షులు రమేష్‌బాబు



హాజరైన అంగన్‌వాడీ ఉద్యోగులు

అంగన్వాడీ టీచర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 36 గంటలు ధర్నా
- మద్దతు తెలిపిన సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

అంగన్వాడీ టీచర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట 36 గంటలు ధర్నా చేపట్టారు. మూడు రోజులపాటు సమ్మెలో భాగంగా దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షకు సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీలు మద్దతు తెలిపాయి. కాగా కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి సమ్మెకు మద్దతు తెలిపి.. రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే సునీత మాట్లాడుతూ.. తెలంగాణలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ అధికారంలోకి వచ్చిన తర్వాత బంగారు తెలంగాణ చేస్తా అని, మహిళలను రోడ్డుపై అర్ధరాత్రి కూడా కూర్చోబెట్టడం ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు? కామారెడ్డి జిల్లాలో 22 వేల మంది బలహీన వర్గాలకు చెందిన మహిళలు గత 40 సంవత్సరాల నుంచి ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. అయినా వీరికి కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ ఇప్పటివరకు కల్పించలేదన్నారు. పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలో అంగన్వాడి టీచర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, నాలుగు లేబర్ కోడ్ విధానాలను వెంటనే రద్దు చేయాలని, అదేవిధంగా 2013 నుంచి టీఏ, డీఏ చెల్లించాలని, అంగన్‌వాడీ ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని, జీవో నెంబర్ 14, 198 వెంటనే సవరించాలని, ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ టీచర్స్ ఎంప్లాయిస్‌కు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారెడ్డి మోహన్‌రెడ్డి



ధర్నాలో అంగన్‌వాడీ ఉద్యోగులు

త్వరితగతిన ఆసుపత్రి భవన నిర్మాణం

ఎమ్మెల్యే హన్మంత్ షిండే



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

త్వరితగతిన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలో జుక్కల్, బిచ్కుంద మండలాలలో 30పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఈ తరహాలో గత ఏడాది డిసెంబర్ 3న మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు హరీష్ రావు రూ.10 కోట్ల 70లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే డ్రాయింగ్ డిసైడ్ చేసి మార్కింగ్ చేస్తున్నందున భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. మండలంతో పాటు నిజాంసాగర్, అంతర్ జిల్లా సంగారెడ్డి పరిధిలోని నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేర్, కంగ్టి, మండలాల ప్రజలకు వైద్య సదుపాయం సులభతరం కానున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఇంతియాజ్ మరణం పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి పట్టణానికి చెందిన యువ కాంగ్రెస్ నాయకుడు కామారెడ్డి పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షుడు అహ్మద్ ఉల్లా ఇంతియాజ్ హఠాన్మరణం పట్ల మాజీ మంత్రి, మాజీ మండలి ప్రతిపక్ష నేత మహమ్మద్ అలీ షబ్బీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తీరని లోటని తెలిపారు. అహ్మద్ ఉల్లా ఇంతియాజ్ సమాజ సేవ చేయాలనే తపన ఉన్న నాయకుడని, ఈ క్లిష్ట సమయంలో మనమందరం అతని కోసం, అతని కుటుంబం కోసం ప్రార్థిద్దామని తెలిపారు.

జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చిన.. కేసీఆర్ పర్యటన..

సీఎం కేసీఆర్ పర్యటన జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల (కాళేశ్వరం) ప్యాకేజ్ 20, 21, 22 ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, కనీసం జిల్లా పర్యటనలోనైనా సీఎం తన నిధుల నుంచి సొమ్మును ప్రకటించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తారని ఆశతో ఎదురు చూశానన్నారు. కేసీఆర్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కమీషన్లు వచ్చే ప్రాజెక్టులు మాత్రమే నిర్మిస్తున్నారని తెలిపారు.

కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జనార్దన్ చేతులమీదుగా కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఏర్గట్ల, దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్, తొర్తి గ్రామాలకు కలిపి వచ్చిన 13 చెక్కులకు గాను 13 లక్షలా ఒక వెయ్యి,508 రూపాయలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం జీఓ నంబర్ 58 కింద ఏర్గట్ల గ్రామానికి 1, తొర్తి గ్రామానికి 1 వచ్చిన సర్టిఫికేట్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఏర్గట్ల సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూధన్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో విజేతగా విజయ్ విద్యార్థిని

నవతెలంగాణ-కంఠేశ్వర్



మొదటి జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ - 2023 పోటీలు కరాటే అసోసియేషన్, తెలంగాణ వారి ఆధ్వర్యంలో మంచిర్యాల్ జిల్లా, బెల్లంపల్లిలో ఫిబ్రవరి-26, ఆదివారం జరిగాయని విజయ్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభాదేవి గురువారం తెలిపారు. తమ పాఠశాలలో 4వ తరగతి చదివే కే. ఆండ్రినా 'కట' విభాగంలో పాల్గొని రజత పతకం సాధించిందని కరస్పాండెంట్ ప్రభాదేవి గురువారం తెలిపారు. రజత పతకం సాధించిన ఈ చిన్నారిని కార్యదర్శి డా. అమతలత, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత ప్రిన్సిపల్ విజేత అభినందించారు.

పేదల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వం

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- గ్యాస్‌సిలిండర్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు



కంఠేశ్వర్: మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



డిచ్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-విలేకరులు

బీజేపీ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరిచేలా వ్యవహరిస్తూ ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ ధరను రూ.50 పెంచడంతో ప్రజలపై భారం పడుతుందని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, మండల రైతు బంధు అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ డైరెక్టర్లు, మండల ప్రధాన కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు డబ్బులు ఇస్తుంటే అన్ని రకాల ధరలు పెంచి ప్రతి ఇంటి నుంచి నెలకు 4వేల రూపాయలు మోడీ ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. మోడీ ప్రభుత్వం సిలిండర్‌పై 13 సార్లు పెంచడంతో 750 రూపాయలు పెరిగిందన్నారు. ధరలు తగ్గించాలని కేంద్రాన్ని స్మృతి ఇరానీ డిమాండ్ చేయాలని తెలిపారు. ప్రధాని తన గుజరాత్ దోస్తులకు 10 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేశారని, అదాని ఒక్కడికి మాఫీ చేసినన్ని డబ్బులు సబ్సిడీగా ఇచ్చినా సిలిండర్ రూ.450 కే వస్తుందని తెలిపారు. పేదలపై భారాలు వేస్తున్న బీజేపీ పార్టీ నాయకుల్ని ఎక్కడిక్కడ నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విట్టల్ రావు, మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు ధరలు పెంచుతూ సబ్‌కు పరేషానీ చేస్తుందని, గ్యాస్, ఇతరత్రా వస్తువుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నారని, ప్రజలను మోసం చేయడానికి బీజేపీ ప్రజా గోస యాత్ర చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కార్నర్ మీటింగ్ పేరుతో గ్రామలకు వచ్చే బీజేపీ నాయకులకు చీపురు కట్టతో సమాధానం చెప్పాలని చెప్పారు. మండల కేంద్రంలో నిర్వహించిన మహాధర్నాలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి 410 రూపాయలే ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు 12వందల రూపాయలకు చేరిందన్నారు. వంటగ్యాస్ ధరలను పెంచిన బీజేపీ నాయకులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారు గ్రామాలకు వేస్తే నిలదీయాలని మహిళలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం లక్షల కోట్లు అప్పు చేసి తమ స్నేహితులకు అంట గట్టిందని, రాష్ట్రం కూడా అప్పు చేసి కాళేశ్వరం రైతుబంధు, రైతు బీమా, పెన్షన్లు, రహదారులు, పరిశ్రమలు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్మూర్: మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, నాయకులు పండిత్ ప్రేమ్, తదితరులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిలిండర్లను తలపై పెట్టుకుని నిరసన తెలిపారు.

నందిపేట్ : మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని అధ్యక్షులు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఏర్గట్ల: బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలో ఖాళీ సిలిండర్లు ఒక దగ్గరకు చేర్చి కట్టెల పొయ్యి వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్‌తో 63వ నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని నాయకులకు సర్దిచెప్పి రాస్తారోకో విరమింపజేశారు.

మాక్లూర్: మండలంలోని మానిక్ బండార్ 63వ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బడుగు సత్యనారాయణ, ఎమ్మెల్యే జీవన్న యువజన అధ్యక్షులు రంజిత్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో జాతీయ రహదారి 63పై ఎంపీపీ శ్రీనివాస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా, చైర్మన్ అశోక్ సర్పంచ్ చిన్నారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ పవన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ముప్కాల్: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ఖాళీ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి మినీ వంటావార్పు చేపట్టినట్టు మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..



ఆర్మూర్‌లో..



ఏర్గట్లలో..



మాక్లూర్‌లో..



కమ్మర్‌పల్లిలో..



మోర్తాడ్‌లో..



నందిపేట్‌లో..

5న ఇంజినీరింగ్ సెక్షన్ రాత పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 5న వెరియస్ (వివిధ రకాల) ఇంజినీర్ డిపార్టెమెంట్ రాత పరీక్షలు నిర్వహిస్తారని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్, ఎంపిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఇన్ వెరియస్ ఇంజనీర్ డిపార్ట్‌మెంట్ రాత పరీక్షలకు 10 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్స్, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వెబ్ సైట్ ఏఏఏ.ంజూంఎ.స్ర్తీఐ.ఱఅలో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రాలను ముందు రోజు చూసుకోవాలని తెలిపారు. అభ్యర్థి తన ఫొటో, పేరు విషయంలో తప్పులు దొర్లినచో తన పాస్ పోర్టు సైజు మూడు ఫోటోలపై గజిటెడ్ అధికారితో సంతకంతో పరీక్ష కేంద్రానికి హాజరు కావలసి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు తీసుకురాకూడదని, షూష్ వేసుకోకూడదని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల 45 నిమిషాలు, మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాల తర్వాత ఎవరికి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు పేర్కొన్నారు. ఈ పరీక్షలపై ఏవైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 08462-220183 కి సంప్రదించాలని కోరారు.

వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-ఆర్మూర్

మోడీ ప్రభుత్వం గృహ వినియోగదారులపై 50 రూపాయలు, కమర్షియల్ వంటగ్యాస్ సిలిండర్ ధరలను 350 రూపాయలు పెంచి సామాన్యులపై అధిక భారం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, మరో దిక్కు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల లబ్ధి కోసం సామాన్య జనాన్నిపై భారవేయడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేనాటికి 14 కిలోల సిలిండర్ ధర 400 రూపాయలు ఉంటే నేడు 1155 రూపాయలకు చేరుకోవడం విచారకరమని తెలిపారు. ప్రజలపై భారం మోపడం, కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వడం ఎట్లాంటి దేశభక్తిని ఆయన మోడీ సర్కార్‌ను ప్రశ్నించారు. మోడీ సర్కార్ హెూలీ పండుగ కానుక గ్యాస్ సిలిండర్ ధర పెంపు అని ఎద్దేవా చేశారు. ఈ ధరల పెంపు వల్ల దేశంలో అన్ని వర్గాల ప్రజలు భారాన్ని మోయవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెనక్కు తీసుకునే విధంగా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ నాయకత్వాన్ని దాసు కోరారు.

సిలిండర్ ధరలను తగ్గించాలి

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నాగారం గోశాల వద్ద పెంచిన సిలిండర్ ధరలు తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. దీపం పథకం ఉజ్వల పథకం పేరుమీద ప్రజలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి 450 రూపాయలు ఉన్న సిలిండర్ ధరను 1200 రూపాయలకు పెంచడం సిగ్గుచేటన్నారు. పని లేక కడుపునిండా తిండి లేక పేదలు ఇబ్బందుల పాలవుతుంటే మరోవైపు నిత్యవసర ధరలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ఆర్థిక భారాలను ప్రజలపై మోపుతున్నారని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో ప్రజలే బిజెపి ప్రభుత్వానికి సమాధానం చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు శ్రీదేవి, శారద, జమున, రాణి, అనిత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రేట్లు పెంచి రక్తం తాగుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ



రాస్తారోకో చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ ఎంత పెంచితే అంత లాభమని కేసీఆర్ సర్కార్ భావిస్తుందని, రేట్లు పెంచి రక్తం తాగుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు అన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని, ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే ప్రధాన మంత్రి మోడీ వంటగ్యాస్ ధరలు పెంచారంటూ వైయస్సార్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం నిజమాబాద్ నగరంలోని రాజా రాజేంద్ర చౌరస్తా వద్ద నిరసనలు చేపట్టారు. ఎన్నికలు అయిపోగానే ప్రతిసారీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. ధరలు పెంచడంతో ఉజ్వల పథకంలో సిలిండర్లు పొందిన మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేయాల్సిన పరిస్థితులు తలెత్తాతయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టి విభాగం జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్ , జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అంకార్ గణేష్ , జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బాలేకార్ మనీష్ తేజ, జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షులు హనుమయ్యా, నగర పార్టీ అధ్యక్షులు కస్తూరి ప్రవీణ్, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, నగర మైనారిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ ఖాన్, నగర మహిళ విభాగం అధ్యక్షురాలు హరిని, యువ నాయకులు దినేష్ నాయక్, సలీమ్, ఇషాక్ అలీ, మహిళ నాయకులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలి

నవతెలంగాణ-మాక్లూర్

ప్రతి రైతు తమ జీవాలకు నట్టల నివారణ మందులను వేయించాలని, పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్తలు వహించాలని పశువైద్యులు తెలిపారు. మండలంలోని రాంచంద్రపల్లి, మానిక్ బండార్ తండా గ్రామాల్లో నట్టల నివారణ మందులను గురువారం పంపిణీ చేశారు. 8347 జీవాలకు మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్, ఎంపీటీసీ పెద్దలు, పశు వైద్యులు కిరణ్ దేశ్ పాండే, గొర్రెల పెంపకందారులు మహేష్, జనార్ధన్, మల్లేష్, సిబ్బంది వీఎల్ఓ వినీత, జేవీవో గంగజమున, వీఏ అహ్మద్ భాషా, శ్రీనివాస్, సాజిద్, సిబ్బంది, పశువుల యజమానులు పాల్గొన్నారు.

4 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్సీ

ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ నిధుల నుండి 4లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీని గురువారం ఇందల్‌వాయి సర్పంచులఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రఘునాథన్ రాము సమక్షంలో ముదిరాజ్ సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులకు ఇచ్చిన హామీని అమలు చేశానని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేయించుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు శక్కరికొండ కష్ణ, మాజీ సర్పంచ్ గంగారాం, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల వైద్యానికి భరోసా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న సర్పంచ్

ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మంది పేదల వైద్యానికి భరోసా లభిస్తుందని సర్పంచ్ గడ్డం స్వామి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన కౌడ శారదకు రూ.32వేల 500, పి లక్ష్మణ్ కు రూ.13వేల ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, లోలం సుమన్, బీసీ సెల్ మండల అధ్యక్షులు హల్దే శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్టాపనకు రావాలని మంత్రికి ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని మిట్టపల్లి గ్రామంలో నిర్మించిన శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్టాపనకు ఈనెల 13న రావాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇల్లోల్ల ఇంద్రకిరణ్ రెడ్డిని ఆహ్వానించారు. గురువారం మండలంలోని మిట్టపల్లి సర్పంచ్ తేలు గణేష్, ఎంపిటిసి బాల గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి ఒడ్డం నర్సయ్య అధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేసి సన్మానించారు. కలిసిన వారిలో గ్రామస్తులు ఉన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమిస్తేనే గ్యాస్ ధరలు తగ్గుతాయి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న సుధాకర్

ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమిస్తేనే గ్యాస్ ధరలు తగ్గుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిరంతరం పెంచుతూ పోతుందని అన్నారు. దీనికి అంతర్జాతీయంగా చమురు బ్యారెల్ ధరలు పెరుగుతున్నాయని సాకు చెబుతునదని, కాని వాస్తవంగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు బ్యారెల్ ధరలు తగ్గినప్పుడు మన దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎందుకు తగ్గడం లేదని అన్నారు. పేద ప్రజలు వాడే ఈ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే ధనికులు ప్రయాణం చేసే విమానపు ఇంధనం ధరలు తగ్గుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంపన్న వర్గాలకు బాసటగా, పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నది. సామాన్యులపై వంట గ్యాస్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధర రూ. 350 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ సామాన్య ప్రజలు ఉద్యమించకుండా ధరలు తగ్గవని, ప్రజలు స్వచ్ఛందంగా ఎక్కడికక్కడ నిరసనలు చేస్తేనే ధరలు తగ్గుతాయని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ముప్కాల్

షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ముప్కాల్ ఆధ్వర్యంలో ఈనెల 4,5 తేదీల్లో వేముల సురేందర్ రెడ్డి స్మారక ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల ప్రవీణ్, గంగుల నవీన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి ఎంట్రీ ఫీ లేదన్నారు. 3వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తూ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ కింది ఫోన్ నంబర్లను 9703340900, 8179258965 సంప్రదించాలని పేర్కొన్నారు..

కమ్మ సంఘాన్ని అప్పుల్లో ముంచి అవినీతికి పాల్పడుతున్నాడు

- కలగర శ్రీనివాస్‌రావు మాటలు అవాస్తవం
- నిజాలు ఉంటే సర్వసభ్య సమావేశానికి వచ్చి ఎందుకు వెళ్లిపోయాడు?
- కమ్మ సంఘం సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న కమ్మ సంఘం సభ్యులు

కమ్మ సంఘాన్ని అప్పుల్లో ముంచి అవినీతికి పాల్పడుతున్నారని, కలగర శ్రీనివాసరావు అన్ని అవాస్తవాలు మాట్లాడుతున్నారని, నిజాలు ఉంటే సర్వసభ్య సమావేశానికి వచ్చి ఎందుకు వెళ్లిపోయాడని కమ్మ సంఘం సభ్యులు ప్రమోద్, రామకృష్ణ అన్నారు. కలగర శ్రీనివాస్ రావు కమ్మ సంఘం పూర్వ అధ్యక్షుడు ప్రెస్‌మీట్‌లో అవాస్తవాలు మాట్లాడారని, కమ్మ సంఘం సభ్యులు ప్రమోద్, రామకృష్ణ తెలిపారు. గురువారం కమ్మ సంఘ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... తాను చెప్పినట్లు కమ్మ సంఘం అధ్యక్షునిగా అయిననాటికి కమ్మ సంఘం అభివద్ధి చెందే ఉందని, కమ్మసంఘానికి తాను ఆస్తులు కూడా పెట్టానని చెప్పడం అంతా అబద్ధమని, ఆ ఆస్తులు పూర్వకమిటీ వారే సమకూర్చారని అన్నారు. తాను ఒక పాలు 342 గజాల స్థలాన్ని ఆయన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ ఆస్తిని బ్యాంకులో సెక్యూరిటి పెట్టి తన బిజినెస్ అభివద్ధి చేసుకున్నాడని ఆరోపించారు. రెన్నోవేషన్ చేస్తానని దానికి కోటి 9 లక్షల బ్యాంకు నుండి లోన్ తీసుకొని, 76 లక్షల రూపాయలు తన పేరిట, ఆయన బంధువుల బ్యాంక్ ఖాతాలోకి అక్రమంగా మళ్ళించాడని అన్నారు. 2015 జనరల్ బాడీ సమావేశానికి 70 లక్షల రూపాయల చూపించి, మళ్లీ జనరల్ బాడీ సమావేశం 2019 నాటికి రెండు కోట్ల 70 లక్షల అప్పుని చూపించగా ఆ అప్పును సభ్యులు ఆమోదించకపోగా పెద్ద మనుషుల కమిటీకి బాధ్యతలు అప్పజెప్పారన్నారు. అప్పు తీర్చుటకు ప్లాట్‌ను అమ్మగా వచ్చిన డబ్బులను అప్పులు చెల్లించి మిగిలిన డబ్బులను ఖాతాలో జమ చేయాలని చెప్పినప్పటికీ సంఘం ఖాతాలో జమ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో కమ్మసంఘం సభ్యులు పాల్గొన్నారు.

హరితహారం సమయానికి మొక్కలను సిద్ధం చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

హరితహారం సమయానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీఓ ప్రకాష్ అన్నారు. గురువారం నర్సరీల్లో పెంచే మొక్కలను ఎంపీఓ ప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండలంలోని మిసన్‌పల్లి గ్రామంలో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ ప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పట్ల సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూన్ మాసంలో నిర్వహించనున్న హరితహారం కార్యక్రమానికి మొక్కలను అందించడానికి సిద్ధం చేయాలన్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుందని నర్సరీల్లో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరుపోసి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటివెలుగు'ను వినియోగించుకోవాలని సదాశివనగర్ ఎంపీపీ అనసూయ అన్నారు. గురువారం మండలంలోని యాచారం, కల్వరాల్ గ్రామాల్లో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్ లతరమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు చేయించారు. అంధత్వ నివారణ కొరకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో కంటి వెలుగును ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింలు, మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, ఉపసర్పంచ్ ఫంగి గోపిచంద్, ఎంపీటీసీలు సవితసంగ్య, రాంచందర్‌రావు, నాయకులు శంకర్ నాయక్, సురేందర్ రాథోడ్, పీర్‌సింగ్ నాయక్, మంగ్యానాయక్, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు

నవతెలంగాణ-మద్నూర్

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘనట మండలంలోని మేనూరు గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన ప్రకారం.. డోంగ్లి మండలంలోని దోతి గ్రామానికి చెందిన రాజు పటేల్, మఠం బసప్ప కలిసి ద్విచక్ర వాహనంపై మేనూర్ వైపు నుంచి మద్నూర్ వైపు వెళ్తుండగా 161వ జాతీయ రహదారి దాటే సమయంలో మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా బైకును ఢీకొట్టగా టూ వీలర్‌పైన వెనుక భాగాన కూర్చున్న మఠం బసప్ప (65) అనే వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనం నడిపే రాజు పటేల్‌కు ఎడమ చేతికి, ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బసప్ప కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవపంచనామా జరిపి పోస్ట్‌మార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అత్తపై హత్యయత్నానికి పాల్పడిన భర్తకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష

నవతెలంగాణ-బోధన్

మహారాష్ట్రలోని ధర్మబాద్‌కు చెందిన కాలేవార్ శంకర్‌గౌడ్ తన భార్య జ్యోతిపై, తన అత్త అయిన పుష్పపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడడంతో బోధన్ కోర్టులో నేరం రుజువై అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ నిందితునికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు.

చోరీని ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని చింతకుంట రామకృష్ణ ఇంట్లో గత నాలుగు రోజుల క్రితం చోరీ జరగగా.. ఆ బంగారం, వెండిని రికవరీ చేసినట్టు లింగంపేట్ ఎస్ఐ శంకర్ తెలిపారు. దొంగతనం జరిగిన తీరును పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దొంగతనం చేసిన వారి ఆచూకీ కోసం పోలీసులు రంగ ప్రవేశం చేశారు. లింగంపేట్ వాసి కుమ్మరి ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ వ్యక్తి దొంగతనం చేసినట్టుగా నిర్ధారణ అయ్యింది. దొంగిలించిన వస్తువులను రికవరీ చేశారు.

స్నాక్స్ పంపిణీ పరిశీలించిన జడ్పీటీసీ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిమిత్తం స్నాక్స్ పంపిణీని జడ్పీటీసీ తిరుమల్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. ప్రతిరోజు పాఠశాల వారు అందిస్తున్న పౌష్టికాహార స్నాక్స్‌ను అందరూ తినాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దివ్య, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, బాపురెడ్డి, శంకర్, పీడీ నరసింహారెడ్డి, మైనార్టీ నాయకులు ఎస్.కె.హసన్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని రుద్రారం శివనగర్ బీటీ రోడ్డు పనులను ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయలతో రోడ్డు వేస్తున్నట్టు తెలిపారు. పనులలో నాణ్యత పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనాలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు.

అంధత్వ నిర్మూలనే ప్రభుత్వం ధ్యేయం

సర్పంచ్ నిరంజని సాయిలు

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలందరికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని సర్పంచ్ నిరంజని సాయిలు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో అంధత్వ నిర్మూలన ప్రధాన ధ్యేయంగా 18 సంవత్సరాల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్ కుమార్, కంటి వైద్యాధికారి కావ్య, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, ఇర్ఫాన్, హెచ్‌ఓలు కరిపే రవీందర్, శ్రావణ్‌కుమార్, గంగాదాస్, కుమార్, లక్ష్మణ్, ఆరోగ్య కార్యకర్తలు కళావతి, భాగ్య, గ్రామ కార్యదర్శి రోజా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మైనారిటీ కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి సర్పంచ్ పార్ద వాణి సాయిరెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుంచి కమ్యూనిటీ భవనానికి ఐదు లక్షలు, ప్రహరీ నిర్మాణానికి మరో ఐదు లక్షల రూపాయలు మంజూరు కాగా, ఆ నిధులతో పనులను ప్రారంభించినట్టు ఆమె పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫిరోజ్యూద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేషు గారి భూమారెడ్డి, డైరెక్టర్ కదిర్ పాషా, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, లక్ష్మణ్ , ఖాసీముద్దీన్, హతిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

నవతెలంగాణ-రామారెడ్డి

సమాజంలో వైద్యులు చేస్తున్న సేవలు వేల కట్టలేనివని, తల్లి జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారని సర్పంచ్ దండబోయిన సంజీవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు గ్రామపంచాయతీ తరపున ఉపసర్పంచ్ పోతునూరి ప్రసాద్‌తో కలిసి వైద్యులకు, వైద్య సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. మండల కేంద్రంలో 4900 మంది కంటి వెలుగులో పరీక్షలు నిర్వహించి వైద్యం కల్పించడమే లక్ష్యంగా పనిచేసిన వైద్యులు, 4395 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 656 మందికి కంటి అద్దాలు అందజేసినట్టు వైద్యులు సురేష్, హరీష్ కుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భీం, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, వైద్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో మెరుగైన చూపు

కేమ్రాజ్‌కల్లాలీ సర్పంచ్ రమేష్ దేశాయి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ గ్రామంలో సర్పంచ్ రమేష్‌రావ్ దేశాయి కంటి వెలుగును స్థానిక ప్రభుత్వ ఎంపీయూపీఎస్ పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయవ్వ, పాఠశాల చైర్మెన్ సుంకరి శంకర్, హెచ్ఎం.జయచంద్, కంటివెలుగు వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే

అందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వాల పాలనలో కంటే తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరయ్యాయని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. గురువారం మండలంలోని అమ్దాపూర్, సంగెం గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్దాపూర్ గ్రామంలో ఇప్పటివరకు రైతుబంధు పథకంలో రూ.6కోట్లు రైతులకు అందించామని, వివిధ రకాల ఫించన్‌లను రూ.14లక్షలు ప్రతి నెల అందిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా చనిపోయిన 17 మంది రైతులకు రూ.85లక్షల రైతుబీమాలో అందించామని, నిరుపేదల ఆడపిల్ల పెండ్లిళ్లకు 100 మందికి కోటి రూపాయలు మంజూరి చేశామన్నారు. గ్రామంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేస్తామని, మిగిలిన వారికోసం మరో 35 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే రైతుల కోరిక మేరకు చెక్‌డ్యాంల నిర్మాణం చేపడతామని, అమ్దాపూర్ నుంచి సంగెం వరకు రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ అంజమ్మ, ఎంపీపీ బుద్దె సావిత్రి, ఏఎంసీ చైర్మెన్ దేశాయి, వైస్ చైర్మెన్ షకీల్, డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్, సుదర్శన్,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో..

మండలంలోని సంగెం గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే షకీల్ భూమిపూజ చేశారు. అనంతరం మనఊరు-మనబడి కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సరదాగా మాట్లాడారు. ఆయన వెంట సర్పంచ్ అంజమ్మ ఎంపీటీసీ హనుమంతు, గ్రామపెద్దలు గంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి..

విద్యార్థులు జీవితంలో స్థిరపడడానికి ఇంటర్మీడియట్ దశ కీలకమని కావున విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడినని, తన తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని కష్టపడి చదివినట్టు తెలిపారు. అంతేకాకుండా జీవితంలో ఎమ్మెల్యే కావాలనే మంచి లక్ష్యంతో కష్టపడ్డానని, చివరికి ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యానని ఆయన అన్నారు. అనంతరం కళాశాలలో అధునాతన రీతిలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అధునాతన రీతిలో ఉండేలా ఆడిటోరియం నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరి చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ మధుమలంచ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరడంతో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణకుమారి, సిబ్బంది శివకుమార్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మరుమతులకు త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి లోకం రఘురాజ్, ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్, ఎంపీపీ బుద్దే సావిత్రి, ఏఎంసీ చైర్మన్ వి.ఆర్.దేశాయ్, వైస్ చైర్మన్ షకీల్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, నాయకులు బుద్దె రాజేశ్వర్, రవీందర్ యాదవ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగెం గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో రూపుదిద్దుకున్న తరగతి గదిలో విద్యార్థులతో కూర్చుండి వారిని ఎమ్మెల్యే ఉత్సాహపరిచారు.

విద్యుత్ లైన్ మార్పిడికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే..

బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తాండాలో జనావాసాలపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ వైర్ల లైన్ మార్పిడికి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ నిధులు మంజూరు చేయించారు. ఇందుకు గాను రూ.1.15లక్షల రూపాయలు మంజూరు చేస్తూ గురువారం సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు ఏడాది కాలంగా ఈ విద్యుత్ వైర్ల మార్పిడికి గ్రామస్థులు నివేదించగా, ఇందుకుగాను పంచాయతీ నుంచి డబ్బులు చెల్లించాలని గ్రామస్తులు కోరినా.. సర్పంచ్ నిరాకరించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఏదేమైనా గ్రామస్థులు చేసిన వినతి మేరకు ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యే షకీల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారస్తులకు కొమ్ము కాస్తున్న కేంద్రం

- ధరల పెంపు నిరసనలో ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/బోధన్

వ్యాపారస్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు గ్యాస్ సిలెండర్ ధరల పెంపు నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. మోడీది ధనికుల ప్రభుత్వమని ఆరోపించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు వలన సామాన్యులు బతికే పరిస్థితి లేదని మోదీ ప్రభుత్వం వ్యాపారస్తులకు కొమ్ము కాస్తూ పేద ప్రజలపై ధరలను పెంచుతూ నడ్డి విరిస్తున్నాడని ఆరోపించారు. అనంతరం కట్టెల పొయ్యి మీద వంట చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ మండలాల ప్రజాప్రతినిధులు జడ్పీటీసీ, ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకులు జలెందర్‌రెడ్డి, అధిములం సతీష్ కుమార్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

గ్యాస్ ధరలు పెరగడంపై నిరసన..

బోధన్ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను అదనంగా రూ.50 పెంచడంపై నిరసిస్తూ బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టీఆర్ఎస్ నాయకులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, మారుతి మందిర్ చైర్మన్ అశోక్‌రెడ్డి, శివాలయం చైర్మన్ బీర్యూర్ శంకర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసైన్డ్ భూమిని

పేదలకు పంచాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు



ఎడ్లసాయంతో దుక్కిని ప్రారంభిస్తున్న కార్యదర్శివర్గ సభ్యులు సుదర్శన్‌రావు

నవతెలంగాణ-గాంధారి

ప్రభుత్వ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని మతు సంగెం గ్రామంలో జరుగుతున్న భూపోరాటంలో భాగంగా ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి.. సీపీఐ(ఎం) జెండాను ఎగురవేశారు. అనంతరం నాగలి పట్టి దుక్కి దున్నడం ప్రారంభించారు.

వివరాలు మెయిన్‌లో..

పాఠశాలలను పరిశీలించిన రాష్ట్ర బృందం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పెంటాఖుర్దు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర బృందం సభ్యులు సంజీవ్‌కుమార్, శ్రీనాథ్, కిషన్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాకాసిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన సామాగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిశీలకులు శ్రీనాథ్, కిషన్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న బృందం

అనంతరం మధ్యాహ్న భోజనం భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు బ్లూ ప్రింట్ ఆధారంగా సీ గ్రేడ్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు.

వారి వెంట ఎంఈఓ నాగనాథ్, మండల నోడల్ అధికారి నాగయ్య, ప్రధానోపాధ్యాయులు అలీమ్ ఉన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తమ సమస్యలను నెరవేర్చాలని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని విద్యుత్ ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల మాట్లాడుతూ.. రాష్ట్ర టీఎస్ఈజేఏసీ పిలుపుమేరకు ఎల్లారెడ్డి డివిజన్లో భోజనం సమయం తర్వాత నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అందులో భాగంగా వేతన సవరణ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్, ఆర్టిజన్స్ పే బేసిక్ లో కలపడంపై, అన్మాండ్ కార్మికుల సమస్యలు, అన్‌లిమిటెడ్ మెడికల్ తదితర సమస్యలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల పాల్గొన్నారు.

యూనియన్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-రెంజల్

తల్లిదండ్రుల నడవడిక పిల్లలకు అలవడుతుందని మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని యూనిక్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో సెల్‌ఫోన్లు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయని, ఫోన్లు లేకుండా ఏ ఒక్క పని చేయకుండా వాటిపైనే ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యూసఫ్, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, విట్టల్‌రావు, ఉపాధ్యాయులు సద్దాం, నాయకులు హాజీఖాన్, మూస, ఖాజా, విద్యార్థి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఏక్లాస్‌పూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరడి గంగాధర్, పశువైద్యులు డా.సురేష్‌కుమార్, సిబ్బంది సుధీర్‌గౌడ్, జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన గిరిబాబు శివరాత్రినాడు ప్రమాదవశాత్తు రథంపై నుంచి పడి గాయాలై, చికిత్స పొంది ఇంటికి రాగా.. గురువారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్‌రెడ్డి పరామర్శించారు. అలాగే తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ కారోబార్ కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల బాబన్న, పోసానిపేట సర్పంచ్ గిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎన్నం రాములు, తదితరులు పాల్గొన్నారు.

పోల విఠల్ గుప్తా సేవలు మరువలేనివి

పోచారం సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

పోల విఠల్ గుప్తా సేవలు మరువలేనివని బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కోటగిరి గ్రామానికి చెందిన పోల విఠల్ గుప్తా వారి కుమారులు, కోడలు, మనవడు, మనవరాలు జ్ఞాపకార్థం, అలాగే పూల రాఘవేంద్ర దీప్తి జ్ఞాపకార్థం మిని బస్సు స్టాపులు రెండు, వైకుంఠ రథం ఒకటి గ్రామపంచాయతీకి అప్పజెప్పారు. వీటిని పోచారం సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ఏఎంసీ వహీద్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, విండో చైర్మన్ కూచి సిద్దు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు ఏజాస్‌ఖాన్, బీర్యూరు గంగాధర్, సలీం, అనిల్ కులకర్ణి, విఠల్‌గుప్తా కుటుంబ సభ్యులు నిషాంత్, పూల అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



బస్‌స్టాప్‌ను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని బేగంపూర్ గ్రామంలో సర్పంచ్ శివరాం సీసీ రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ శాసన సభ్యులు హన్మంత్ షిండే సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. మండలంలో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిధులు కేటాయించినట్టు బేగంపూర్ గ్రామానికి 5లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాం, సర్పంచ్ తిరుమలరెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్, మాజీ సర్పంచ్ హన్మండ్లు, సుధీర్, ఆంజనేయులు, అంజయ్య పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ధర్మపురికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

నవతెలంగాణ-ఆర్మూర్



ధర్మపురి జాతరను పురస్కరించుకొని డిపో నుండి ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి ప్రత్యేక సర్వీసులు నడిపించనున్నట్టు డిపో మేనేజర్ కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుండి 8తేది ఆర్మూర్ పెర్కిట్ మోర్తాడ్ కమ్మర్పల్లి నుండి బస్సులు నడవనున్నట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం 110 బస్సులను నడిపామని, ఈ సంవత్సరం 110 నుండి 130 బస్సులను నడుపుతామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైతే బస్సులను అదనంగా పెంచుతామని పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

5న అపురూప పురస్కారాలు ప్రదానం

విజయ్ విద్యాసంస్థల అభినేత్రి డాక్టర్ అమృతలత

నవతెలంగాణ-ఆర్మూర్

వివిధ కళారంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ఈనెల 5 ఆదివారం గుత్ప అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయంలో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకులు విజయ్, విద్యాసంస్థల అభినేత్రి డాక్టర్ అమృతలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి, ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. కళాకారులు, సాహితీ వేత్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

మహిళల హక్కులు కాలరాస్తున్నారు

- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అనాదిగా మహిళల హక్కులు కాలరాస్తున్నారని ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కమ్మర్‌పల్లిలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. 112వ అంతర్జాతీయ మహిళా దినోత్సవ జరుపుకుంటున్న తరుణంలో మహిళలకు సరైన స్వేచ్ఛ లేదన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అణిచివేతకు గురి చేస్తున్నారని వాపోయారు. సామాజిక వివక్ష చూపుతూ మహిళలను కేవలం వంటింటికే, పిల్లలను కనడానికే పరిమితం చేస్తూ బలి పశువులు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయాల్లో, ఉద్యోగాల్లో, ఇతర అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ వారిపైన వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అవలంభిస్తూ, మహిళలపై దాడులకు పూను కుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు, నిత్యవసరాల ధరలు పెంచుతూ పేదలపై భారాలు మోపుతోందన్నారు. కాలేజీల్లో, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని, మహిళలు ఎవరికి చెప్పుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు సత్తెక్క, ఆర్మూర్ ఏరియా ఉపాధ్యక్షురాలు పద్మ , కమ్మార్ పల్లి ఏరియా ఉపాధ్యక్షురాలు ఉట్నూర్ రాధ, మహిళ నాయకులు సారా లక్ష్మి, వినోద, ఎలిశా, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

నవవధువు బలవన్మరణం

- పెళ్లైన రెండునెలలకే దుర్ఘటన
- మృతిపై పలు అనుమానాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెళ్లయిన రెండు నెలలకే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బలవన్మరణానికి పాల్పడటం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కలకలం సష్టించింది. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల సుధా హైట్స్ అపార్ట్ మెంట్ పై నుంచి దూకి నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది. పూర్ణిమ (26) గురువారం ఉదయం 5వ అంతస్తు నుంచి దూకింది. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మతి చెందినట్లు డాక్టర్స్ ధ్రువీకరించారు. పూర్ణిమ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి కాగా వర్క్ ఫ్రంహోంగా పని చేస్తున్నారు. భర్త విశాల్ బిల్డింగ్ కాంట్రాక్ట్ బిజినెస్ చేస్తున్నారు. పూర్ణిమ భర్త విశాల్ కుటుంబం గత కొన్ని సంవత్సరాల నుండి ఈ అపార్ట్ మెంట్లోనే అద్దెకు ఉంటున్నారు. మూడు రోజుల క్రితం మూడో ఫ్లోర్లో ఒక ప్లాటును కొనుగోలు చేశారు. పెళ్లయిన రెండు నెలలలోపేఆత్మహత్య చేసుకోవడం పట్ల స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్ణిమతో పాటు భర్త విశాల్, అత్త, మామ ఒకే దగ్గర కలిసి ఉండగా ఆమె మరిది హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.



పూర్ణిమ మృతదేహం

మూడవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడో పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడికి చెందిన కూన రమేష్ తన ముగ్గురు కూతుర్లలో చిన్న కూతురు అయినా పూర్ణిమ(లక్ష్మీ) ప్రైవేట్ కంపెనీ లో సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్‌గా పని చేస్తుంది. రెండునెలలక్రితం విశాల్‌తో వివాహం చేశారు.



పూర్ణిమ (ఫైల్)

వారు అన్యోన్యంగా ఉన్నారు. గురువారం ఉదయం 11గంటలకు ఆమె ఇంటి బాల్కనీ లోకి వంట పాత్రలు తీసుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడగానే తలకి, ఇతర చోట్ల బలమైన రక్త గాయాలు అయ్యి అక్కడికక్కడే మరణించింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పోలీస్ స్టేషన్లో ఎస్ఐ శ్రావణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

స్థానికుల వివరాలు మరోలా..

పోలీసులకు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభిస్తున్నారు అయితే బాల్కనీలో నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నదంటున్నారు కానీ, స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అపార్ట్మెంట్ మొత్తం పైకి వెళ్లి అక్కడఉన్న ఒక కూర్చుని వేసుకుని మరీ పైనుంచి దూకినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో తన భర్త బాత్రూంలో స్నానం చేస్తున్నాడని, అత్తమామలు ఫంక్షన్‌కు వెళ్లారని చెబుతున్నారు. కానీ ఆ అపార్ట్మెంట్లో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. అలాగే పోలీసుల విచారణలో వెనుక భాగంలో ఎక్కడైతే మతదేహం పడి ఉందో ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ఇల్లుకు సీసీ కెమెరా ఉంది. అలాగే ఎస్బిఐ బ్యాంకు, సీసీ కెమెరా ఉంది. వాటిని చూస్తే ఆధారాలు ఏమైనా బయటపడవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

కంటి వెలుగుకు అనూహ్య స్పందన



కంటి అద్దాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆర్మూర్

కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం గురువారం 13, 31 వార్డుల్లో ప్రారంభించారు. పట్టణ ప్రజలందరూ ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలుపైబడి నుండి వద్దుల వరకు కంటి సమస్య ఉన్నవారు కేంద్రాలకు వచ్చి ఉచితంగా కళ్లద్దాలు, సరిపడా మందులు, డ్రాప్స్ తీసుకొని కంటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితపవన్, కౌన్సిలర్స్ స్వాతిసింగ్, భారతి, ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



భూమి పూజ చేసిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సీసీ రోడ్డుకు జడ్పీటీసీ నిధులు రూ.5 లక్షల రూపాయలు మంజూరు కావడంతో గురువారం సర్పంచ్ మారెల్లి విష్ణుతో కలిసి జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామస్తులు జడ్పీటీసీకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు జోషి వెంకట్ రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమ శంకర్, ఉప సర్పంచ్ సజన విశ్వనాథ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దాసరి శేఖర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు..

నాస్థలంలో శవాలను పూడుస్తున్నారు..

బాధితుడు యశ్వంత్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



తమ స్థలంలో నందమూరి తారక రామారావు కాలనీకి చెందిన వారు మృతిచెందితే శవాలను పాతి పెడుతున్నారని ఇది ఎంతవరకు సమంజసమని బాధితుడు యశ్వంత్ అన్నారు. దీనిపై గురువారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం తమ పట్టాభూమిలో పాతిపెట్టేందుకు మృతదేహాన్ని తీసుకువచ్చారన్నారు. దీనిపై రూరల్ ఎస్సై, ఆర్ఐకి ఎంత మొరపెట్టుకున్నా ఇది 200మంది ప్రజలకు సమస్యగా మారుతుందని అంటున్నారన్నారు. కాలనీ ప్రజలతో అధికారులు మమేకమై తమ పొలంలో ఖననం చేయడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో అప్పటి కలెక్టర్ యోగితారాణా ఈ స్థలం పట్టా భూమి, ఇతరులు ఎలా వెళ్తారని చెప్పినప్పటినుండి ఎవరూ రాలేదన్నారు. మళ్ళీ ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నాయని గత నెల 13న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఆయనను అధికారులు తారక నగర్ ప్రజలకు సహకరిస్తూ తమ స్థలంలో శవాలను పాతి పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పరుచూరు కుటుంబం.. సమాజానికి ఆదర్శం

- సంతాపసభలో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

నవతెలంగాణ నిజామాబాద్‌సిటీ

పరుచూరు కుటుంబం సమాజానికి ఆదర్శమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. నాందేవాడలోగల తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో పరుచూరి కుటుంబరావు సంతాప సభ గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు సిర్పలింగం పాట పాడి తన అనుభవాన్ని పంచుకున్నారు. ఈ సమావేశానికి గంగాధరప్ప అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా హాజరైన టి.సాగర్ మాట్లాడుతూ పరుచూరు కుటుంబరావు చివరి వరకు నిజామాబాదులో తొలి కమ్యూనిస్టు కార్యకర్తగా ఉన్నారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చిన సీపీఐ(ఎం) పార్టీలోనే కొనసాగారని తెలిపారు. కొడుకు సిపిఐ ఎంఎల్ పార్టీలో పని చేసిన ఆయన బంధువులు తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ, కుటుంబరావు ఆయన సీపీఐ(ఎం) పార్టీలోనే చివరి వరకు ఉండటం గొప్ప విషయమని అన్నారు. ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఇవ్వటం ఆయన వ---వ్యక్తిత్వానికి నిదర్శనమని కొనియాడారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని ఐదున జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతుందని పేదలపై భారాలు వేస్తుందని పెద్దలకు రాయితీలు ఇస్తూ, పేద ప్రజలకు సబ్సిడీ లేకుండా చేస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తులను తీసుకురావాలని చూస్తుందని, ఈ విధానాలను మానుకోవాలని అన్నారు. చట్టాలను సవరించి నాలుగు కోడ్లుగా మార్చడాన్ని వెనక్కి తీసుకోవాలని తెలిపారు. ఈ సమస్యలపై ఏప్రిల్‌లో చేపట్టే చలో ఢిల్లీ జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వేంకటేష్, భూమేశ్వర్, దేవెందర్ సింగ్, లింగం, గంగమణి, రాజన్న పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న రాష్ట్ర నాయకులు సాగర్, జిల్లా నాయకులు

బైరి నరేష్‌పై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- బీఎల్ఎఫ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బైరి నరేష్‌పై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నరేష్‌కు తగిన భద్రత కల్పించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ దండివెంకట్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరినరేష్‌పై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. బైరి నరేష్ కు రాష్ట్ర ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని కోరారు. పోలీసుల సంక్షేమంలోనే దాడి చేయడం వరంగల్ పోలీస్‌ల ప్రతిష్టను దిగజార్చిందని తెలిపారు. బైరి నరేష్ గతంలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేసి జైలుకు పంపిందని, అంతే కాదు నరేష్ తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు సైతం చెప్పారని పేర్కొన్నారు. బైరి నరేష్ విషయాన్ని చర్చానియంశంగా మార్చడం ద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నం చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నా లాల్ నీల్ ఉద్యమ శక్తులు ఎవరికి వారు ఉండడం అభివద్ధి నిరోధక శక్తుల ఆగడాలపై తక్షణ ఐక్యకార్యాచరణకు సిద్ధం కావాలని కోరారు.

పురుగు మందులు అధికంగా వాడవద్దు

- జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మాక్లూర్

రైతులు ఎక్కువగా పురుగు మందులు వాడవద్దని జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని గుత్ప, రాంచంద్రపల్లి గ్రామంలో పంటల నమోదు వివరాల సేకరణను ఆయన అకస్మాత్తుగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంటలతో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎక్కువగా పురుగు ఎందులు వాడవద్దని, యూరియా మోతాదు తగ్గించాలని, ఎక్కువ వాడితే పంటలు చీడపీడల బారిన పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని పద్మ, విస్తారణాధికారిని ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

నాగపూర్‌లో కంటి వెలుగు ముగింపు



వైద్యులను సన్మానించిన సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో చేపట్టిన కంటి వెలుగు కంటి పరీక్షల శిబిరం ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలెపు సాయమ్మ కంటి వెలుగు వైద్య బృందానికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహస్వామి మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 72 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 86 మందికి దూరం చూపుగలవారికి కావలసిన కళ్లద్దాలు తయారు చేయించి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 137మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, కంటి వైద్యులు శివ, ఏఎన్ఎంలు అరుణ, క్రిష్ణవేణ, స్వరూప, డీఈవో అభినవ్, ఆశాకార్యకర్తలు శారదా, పద్మ, శాంత, వినిలా, తిరుమల, రాధా, ఉమా, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకులు పాలెపు రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగించుకోండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎఫ్‌సీ) ట్రైనింగ్, ఎంప్లాయ్ మెంట్, ప్లేస్మెంట్ ప్రోగ్రామ్ కింద నిజామాబాద్ జిల్లాలోని అర్హులైన మైనారిటీ మహిళలు, నిరుపేదలు, విడాకులు పొందినవారు, అనాథలు, వితంతువులు మొదలైన వారికి వేతన ఉపాధి కల్పించడంకోసం గార్మెంట్స్ ప్రొడక్షన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం జిల్లా మైనారిటీలు, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు, బైత్-ఉల్-మాల్ మొదలైన వారి నుండి ప్రతిపాదనలను ఆహ్వానిస్తోందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. జతపరచలిసిన అర్హత ప్రమాణాలు పత్రాలు, శిక్షణ, ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం నిర్మాణ స్థలం సుమారు 240 చ.గ.ల విస్తీర్ణం ఉండాలని, దాని రిజిస్టర్ చేయబడిన ఎన్జీవో, ట్రస్ట్ డీడ్ వివరాలు, ట్రస్టీ వివరాలు వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్‌తోపాటు మూడు సంవత్సరాల వార్షిక నివేదిక, ప్రోగ్రెస్ రిపోర్ట్, లాభ నష్టాల ఖాతా ఆడిట్ నివేదికలతో తాత్కాలిక బ్యాలెన్స్ షీట్, బ్యాంక్ స్టేట్మెంట్ జతపరచాలని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ విద్య, అనుభవ ప్లేస్ మెంట్ వివరాలు తెలియజేయాలని, ఆసక్తి అర్హత గలవారు తమ ఫార్మాట్లో జతపరాచాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా మైనారిటీ అధికారి కార్యాలయం నిజామాబాద్ నందు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 5లోపు సమర్పించాలని పేర్కొన్నారు.

కంటి వెలుగు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 20వ వార్డులోగల కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా పరిశీలకుడు డాక్టర్ వెంకటేష్ గురువారం సందర్శించి కంటి వెలుగు కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తమకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తిచేయాలని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్యాంపు మెడికల్ ఆఫీసర్సి డాక్టర్ హుమేర యాస్మిన్ హెచ్ ఎస్ సుగుణ ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, గుండ గణేష్, అరుణ, కవిత, డాటా ఎంట్రీ ఆపరేటర్ మీరాబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కును సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామ హైస్కూల్ పిల్లలు అరణ్య అర్బన్ పార్క్‌ని సందర్శించారు. ఫారెస్ట్‌లో జరిగే అభివద్ధి పనులు, ఫారెస్ట్‌లో అగ్నిప్రమాదం జరిగితే ఎలా కట్టడి చేయాలో, చిల్డ్రన్స్ పార్క్, జిమ్, ఓపెన్ క్లాస్ రూమ్, వాచ్ టవర్, ఫారెస్ట్ లోని మొక్కల గురించి వివరించారు. నర్సరీ లో పెంచే మొక్కల గురించి క్షుణంగా వివరించారు. కార్యక్రమంలో బాల్కొండ ఫారెస్ట్ ఆఫీసర్ సౌమ్య పర్యవేక్షణలో ఆర్మూర్ ఫారెస్ట్ ఆఫీసర్ మాధవి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలి

- ఎన్ఎస్‌యూఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని నార్సింగ్‌లో గల శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సాత్విక్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకొని చనిపోవడాన్ని నిరసిస్తూ నిజామాబాద్ లోని గూపన్ పల్లి లో గల శ్రీ చైతన్య స్కూల్‌ను బంద్ చేయించారు. అనంతరం వేణు రాజ్ మాట్లాడుతూ.. శ్రీచైతన్యలో మార్కులు, ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసికంగా కంగదీసి వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని అన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల కళాశాల భవనాలు అధునాతన జైళ్ల ను తలపిస్తాయని పరిమితికి మించి విద్యార్థులను ఆ భవనాల్లో కుక్కి ఎలాంటి విరామాలు లేకుండా దాదాపు 16 గంటలు వారిపై ఒత్తిడి చేసి బలవంతంగా చదివిపిస్తున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు బాల్య దశని దాటే సమయంలో బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చదువు పేరుతో జైళ్ల లాంటి భవనాలు వారిని బంధించి వేధించడం అనేది వారి హక్కులను హరించడమేనని ఆయన అన్నారు. శ్రీచైతన్యలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం కొత్తేమి కాదని అన్నారు. విద్యార్థులను మానసికంగా వేధించడం వంటి దాస్టికాలపై పలుమార్లు విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులకు విన్నవించినా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు ఆశపడి వారు పెడచెవిన పెడతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ కళాశాలలను నడిపిస్తూ విద్యా ప్రమాణాలు గానీ విద్యా విలువలు లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలతోపాటు మిగిలిన కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన శ్రీ చైతన్య కళాశాల శాశ్వతంగా మూసివేయాలని అలాగే విద్యార్థి కుటుంబానికి కళాశాల యాజమాన్యం తరపున కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే శ్రీ చైతన్య విద్యా సంస్థలను మూసివేసే వరకు పోరాటం చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో శివ, సయ్యద్ అర్మాన్, నిఖిల్ రెడ్డి, నితిన్, రాంజీ, లక్కీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :హైదరాబాద్‌లోని కార్పొరేట్ విద్యా సంస్థ అయిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న సాత్విక్ అనే విద్యార్థి కళాశాలలోని అధ్యాపకుల, యాజమాన్యాల ఒత్తిడికి భరించలేక ఆత్మహత్యకు పాల్పడడాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ముందు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, పట్టణ అధ్యక్షులు కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ...విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పెడుతున్న అధ్యాపకులను, యాజమాన్యాలను అరెస్టు చేసి కేసులు బనాయించాలని. అదేవిధంగా ఇలాంటి కళాశాలలను, పాఠశాలను వెంటనే రద్దుచేసి, మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షులు సాయినాథ్ రెడ్డి, పెరంబదూర్ వాసు, పెద్దోళ్ల భరత్, కార్యదర్శి రెడ్డబోయిన మూర్తి, ఓబీసీ మోర్చ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు పులి యుగంధర్ పాల్గొన్నారు.